నమస్తే తెలంగాణ
జనగామ
3 | బుధవారం 5 జూన్ 2024 | JANAGAON

సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

వరంగల్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

కాశీబుగ్గ, జూన్ 4: వరంగల్(ఎస్సీ) పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకూ సహకరించిన ప్రతి ఒక్కరికీ వరంగల్ లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ధన్యవాదాలు తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన ఓట్ల లెక్కింపును కేంద్ర ఎన్నికల కౌంటింగ్ అబ్జర్వర్లు బండారి సాగత్ రణవీర్‌చంద్, రాజేశ్‌కుమార్ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేస్తూ సజావుగా నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎన్నికలు జరగడం సంతోషంగా ఉందని ఆర్వో అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను జారీ చేసినప్పటి నుంచీ.. లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకూ సహకరించిన అధికార యంత్రాంగం, మీడియా, రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

పిడుగు పడి ఇద్దరు మృతి

మలహల్‌రావు, వాసం పద్మ (ఫైల్)

మల్హార్/పలిమెల, జూన్ 4 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. మల్హార్ మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన నేరేడుగొమ్మ మలహల్‌రావు (52) తన ఆయిల్ పామ్ తోట వద్దకు వెళ్లాడు. ఇదే సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రారంభమై ఒక్కసారిగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి కావస్తున్నా మలహల్‌రావు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తోట వద్దకు వచ్చి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పలిమెల మండలంలోని నీలంపల్లి గ్రామానికి చెందిన వాసం పద్మ (45) మరికొందరు మహిళలతో కలిసి గోదావరి నదికి చేపలు పట్టేందుకు వెళ్లింది. ఉరుములు, మెరుపులతో వాన పడుతుండడంతో ఇంటికి పరుగెత్తుకుంటూ వస్తుండగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కొడుకులున్నారు. కాగా, మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కడియం కావ్యకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్వో ప్రావీణ్య, చిత్రంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, తదితరులు

బలరాంనాయక్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్వో అద్వైత్‌కుమార్ సింగ్

కాంగ్రెస్ గెలుపు

లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. వరంగల్ నుంచి కడియం కావ్య, మహబూబాబాద్ నుంచి పోరిక బలరాం నాయక్ గెలిచారు. మంగళవారం ఉదయం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని గోదాముల్లో, మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలోని సెంటర్‌లో ఓట్ల లెక్కింపు జరిగింది. మొదట పోస్టల్ బ్యాలెట్ల ఓట్లను లెక్కించి ఆ తర్వాత ఈవీఎంల కౌంటింగ్ చేసి గెలుపొందిన వారికి ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆయాచోట్ల కౌంటింగ్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారులు ప్రావీణ్య, అద్వైత్ కుమార్‌సింగ్ పర్యవేక్షించగా, బందోబస్తుపై పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సూచనలు చేశారు. అలాగే ఉమ్మడి వరంగల్ పరిధిలో ఉన్న పెద్దపల్లి లోక్‌సభ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, భువనగిరిలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కరీంనగర్‌లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ విజయం సాధించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు ప్రకటించారు.

- వరంగల్, జూన్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- పెద్దపల్లి, భువనగిరిలోనూ హస్తం విజయం
- కరీంనగర్‌లో రెండోసారి బండి సంజయ్‌కే పట్టం
- ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల ప్రక్రియ

వరంగల్ ఎంపీగా కడియం కావ్య
మహబూబాబాద్‌లో బలరాం నాయక్

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించారు. వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌పై 2,20,339 ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యారు. మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా బలరాంనాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితపై 3,49,028 ఓట్ల మెజార్టీతో గెలిచారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాల్లోనూ ఈసారి కాంగ్రెస్ విజయం సాధించింది. అలాగే పెద్దపల్లి, భువనగిరి లోక్‌సభ స్థానాల్లోనూ కాంగ్రెస్ గెలిచింది. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థులు గడ్డం వంశీకృష్ణ, బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌పై 1,31,364 ఓట్ల మెజార్టీతో గెలిచారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌పై 2,22,170 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. కరీంనగర్‌లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుపై 2,25,209 మెజార్టీతో రెండోసారి గెలిచారు.

కావ్యకు పలువురి శుభాకాంక్షలు

కాశీబుగ్గ: వరంగల్ ఎంపీగా గెలుపొందిన డాక్టర్ కడియం కావ్యకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, తదితరులు కంగ్రాట్స్ చెప్పారు. ఎన్నికల ఫలితాల కోసం కాశీబుగ్గ నుంచి మార్కెట్ వరకు పెద్ద ఎత్తున నాయకులు తరలివచ్చి వేచి ఉన్నారు. తుది ఫలితం వెల్లడయ్యాక ఎన్నికల అధికారి ప్రావీణ్య ధ్రువీకరణ పత్రం అందించారు. భూపాలపల్లి, హనుమకొండ, జనగామ జిల్లాల కలెక్టర్లు భవేశ్‌మిశ్రా, సిక్తాపట్నాయక్, షేక్ రిజ్వాన్‌బాషా, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, సంధ్యారాణి, డీసీపీ రవీందర్, ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, తిరుపతి, రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు పలువురు ఓట్ల లెక్కింపును పరిశీలించారు. బందోబస్తుపై సీపీ పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు.

వరంగల్‌లో కౌంటింగ్ చేస్తున్న ఎలక్షన్ సిబ్బంది

ఇండియా కూటమికి మంచి ఫలితాలు

వరంగల్ ఎంపీగా గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు అభినందనలు. దేశంలో ఇండియా కూటమికి మంచి ఫలితాలు వచ్చాయి. చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడం ఆంధ్రప్రదేశ్ ప్రజల అదృష్టం. ఆయనను జైలుకు పంపిన రోజే జగన్ ఓటమి ఖాయమని తేలిపోయింది. కక్ష సాధింపు చర్యలతోనే జగన్ ఓటమిపాలయ్యాడు.

– కొండా సురేఖ, మంత్రి

ప్రజాసేవకు అంకితమవ్వాలి

ప్రజాసేవకు అంకితమవ్వాలి. అధికారం రాగానే అహంకారంతో ప్రతిపక్షాలను చిన్న చూపు చూసి, కేసులతో వేధిస్తే ప్రజల చీత్కారానికి గురవుతారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇదే ఫలితం వచ్చింది. ప్రతిపక్ష నాయకులను వేధించినందుకు, ప్రజలను లెక్క చేయనందుకే జగన్ ఓటమి పాలయ్యారు. చంద్రబాబు గెలిచారు.

– కడియం శ్రీహరి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే

వరంగల్ లోక్‌సభ ఓట్లు(పార్టీల వారీగా..)

పార్టీ	2014	2019	2024
బీఆర్ఎస్	6,95,918	6,12,498	2,30,820
కాంగ్రెస్	3,02,366	2,62,200	5,75,566
బీజేపీ	2,06,200	83,777	3,55,875

మహబూబాబాద్

పార్టీ	2014	2019	2024
బీఆర్ఎస్	3,19,388	4,62,109	2,63,322
కాంగ్రెస్	2,83,735	3,15,446	6,12,350
బీజేపీ	2,15,664	25,487	1,19,341

(2014లో బీజేపీ పొత్తుతో టీడీపీ పోటీ చేసింది)

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా(వరంగల్)

నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
స్టేషన్‌ఘన్ పూర్	98,145	40,332	43,720
పాలకుర్తి	87,293	28,452	47,878
వరంగల్ తూర్పు	66,627	74,581	20,360
వరంగల్ పశ్చిమ	63,400	60,611	19,680
వర్ధన్నపేట	94,238	57,427	31,345
పరకాల	76,400	44,841	36,477
భూపాలపల్లి	89,463	49,631	31,360

మహబూబాబాద్

	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
మహబూబాబాద్	1,02,011	17,684	52,128
డోర్నకల్	95,306	9,884	50,293
నర్సంపేట	1,00,339	24,220	45,228
ములుగు	86,825	19,029	33,592
ఇల్లెందు	92,957	12,494	33,658
పినపాక	77,430	15,170	28,111
భద్రాచలం	53,637	10,294	19,406

మహబూబాబాద్‌లో ఓట్లను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

ఇది కాంగ్రెస్ సమష్టి విజయం

వరంగల్ ప్రజలు కాంగ్రెస్‌కు వన్‌సైడ్‌గా ఓటేశారు. ఇది కాంగ్రెస్ సమష్టి విజయం. వరంగల్ సమస్యలపై నాకు సంపూర్ణ అవగాహన ఉన్నది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తా. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, మామునూరు ఎయిర్‌పోర్ట్, వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం కృషి చేస్తా. యువత ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నిస్తా. డాక్టర్‌గా నిత్యం పేద ప్రజల మధ్య ఉంటా. పేదల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా దృష్టి సారిస్తా. పట్టణ ప్రాంతంలో బీజేపీ కొంత ప్రభావం చూపినా ఫలితాల్లో అది నామమాత్రంగానే ఉన్నది.

– వరంగల్ ఎంపీ కడియం కావ్య

పేదలకు సేవ చేసే అవకాశం వచ్చింది

మహబూబాబాద్ రూరల్: పేదలకు సేవ చేసే సువర్ణ అవకాశాన్ని మానుకోట పార్లమెంట్ ప్రజలు ఇచ్చారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను తప్పనిసరిగా అమలు చేస్తాం. మానుకోట పరిధిలోని అనేక ప్రాంతాలు ఇంకా వెనుకబడి ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేసేలా ప్రత్యేక దృష్టి పెడతా. ప్రధానంగా బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, భద్రాచలం ఆలయ అభివృద్ధి జరిగేలా కృషి చేస్తా. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మోడల్ స్కూల్స్, పలు కళాశాలలు తెచ్చినం. మళ్లీ వాటిని అప్‌గ్రేడ్ చేయిస్తా. అనేక ప్రాంతాల్లో హైలెవల్ వంతెనలు లేక పేద ప్రజలకు ఇబ్బంది అవుతోంది. వాటిపైన ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తా. మానుకోట పార్లమెంట్ పరిధిలో ఎక్కువగా గిరిజన ప్రాంతం ఉంది. ఈ ప్రాంత అభివృద్ధికి ఎల్లవేళలా ప్రజల వెంట ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తా. మహబూబాబాద్, కేసముద్రం, పలు స్టేషన్లలో రైళ్ల హాల్టింగ్ చేసేలా చూస్తా. ఇంత మెజార్టీ గెలిపించిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు. నా గెలుపునకు సహకరించిన పార్టీ శ్రేణులు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటా.

– మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్

ఎనుమాముల మార్కెట్ వద్ద పర్యవేక్షిస్తున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా

108లో ప్రసవంపై డీఎంహెచ్‌వో సీరియస్

- వాజేడు పీహెచ్‌సీ సందర్శన
- వాజేడు, ఏటూరునాగారం, ములుగు వైద్యులకు షోకాజ్ నోటీసులు

నమస్తే ఎఫెక్ట్

వాజేడు పీహెచ్‌సీలో రిజిస్టర్లు, రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య

వాజేడు, జూన్ 4: 108 వాహనంలో ప్రసవంపై ములుగు డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య సీరియస్ అయ్యారు. 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో మంగళవారం ప్రచురితమైన '108లోనే పురుడు.. నిరుపేదకు అందని వైద్యం' కథనానికి ఆయన స్పందించారు. ఘటనపై బాధ్యులను చేస్తూ వాజేడు, ఏటూరునాగారం సీహెచ్‌సీ, ములుగు దవాఖాన వైద్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి నివేదికను కమిషనర్‌కు అందజేయనున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. వాజేడు పీహెచ్‌సీని మంగళవారం ఆయన సందర్శించి అటెండెన్స్ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆశా డే రివ్యూ మీటింగ్‌లో పాల్గొని వైద్య సిబ్బందికి పలు సూచనలను చేశారు. గర్భిణులను గ్రామాల వారీగా గుర్తించి పీహెచ్‌సీలు, వైద్యశాలకు తీసుకొచ్చి ప్రసవం చేయించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యాధికారులు మహేందర్, మధుకర్, జ్ఞానాస, సీహెచ్‌వో సూర్యప్రకాశ్, హెల్త్ సూపర్‌వైజర్స్ కోటిరెడ్డి, వెంకటరమణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

వాజేడు, జూన్4 : ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాథపురంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా మంగళవారం గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇల్లందుల ఏసు సోమవారం వంట చెరకు కోసం కొంగాల అడవిలోకి వెళ్లి మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి మృతి చెందిన నేపథ్యంలో నిరసన చేపట్టారు. జాతీయ రహదారిపై ఏసు కుటుంబసభ్యులతో పాటు బంధువులు, గ్రామస్తులు ర్యాలీ తీశారు. 'మావోయిస్టుల పోరాటం అంటే అమాయకులు, మూగ జీవాలను చంపడమేనా?, అడవుల్లో స్వేచ్ఛగా తిరిగే హక్కు ఏజెన్సీవాసులకు లేదా' అంటూ మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

జాతీయ రహదారిపై మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ తీస్తున్న గ్రామస్తులు

మండలి కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- నేడు ఉదయం 8 గంటల నుంచి మొదలు
- మధ్యాహ్నం నుంచి తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- ఒక్కో రౌండ్‌లో 96వేల ఓట్ల లెక్కింపు
- 36 గంటలకు పైగానే కౌంటింగ్ సమయం
- పకడ్బందీగా లెక్కింపు, ఏర్పాట్లు పూర్తి : ఆర్‌ఓ హరిచందన

నల్లగొండలోని ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం

నల్లగొండ ప్రతినిధి, జూన్4(నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. నల్లగొండ పట్టణ శివారులోని ఎ.దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో నాలుగు కౌంటింగ్ హాల్స్‌లో బుధవారం ఉదయం8గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానున్నది. మొత్తం 605 పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సుల నుంచి ఓట్లను కట్టలు కట్టి మధ్యాహ్నం నుంచి తొలి ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. తుది ఫలితం తేలేందుకు అర్ధరాత్రి అయ్యే అవకాశముంది. ప్రధానంగా బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి సహా మొత్తం 52మంది అభ్యర్థులు బరిలో ఉండగా కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసి, 144 సెక్షన్ అమలుచేశారు. కౌంటింగ్‌కు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన ప్రకటించారు. కౌంటింగ్ కేంద్రం ఏరియాలో 144 సెక్షన్ అమలులో ఉన్న కారణంగా పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఎవరూ గుమికూడవద్దని ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ముందుగా బండిల్స్ ప్రక్రియ

నాలుగు కౌంటింగ్ హాల్స్‌లో ఒక్కో హాల్‌లో 24 టేబుళ్ల చొప్పున మొత్తం 96 టేబుళ్లపై లెక్కింపు ప్రక్రియ కొనసాగనుంది. వీటిపై ముందుగా బ్యాలెట్ పత్రాలను కట్టలు కడుతారు. 605 పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులను వరుస క్రమంలో టేబుల్‌కు ఒకటి ఇచ్చి ఒపెన్ చేస్తారు. బ్యాలెట్ బాక్సుల్లోని బ్యాలెట్ పేపర్లను టేబుల్‌పై కుప్పగా పోసి 25 పేపర్లను ఒక కట్టగా చేసి బండిల్స్ చేస్తారు. పోస్టల్ బ్యాలెట్లను కూడా ఇదే సమయంలో వీటితో కలిపేస్తారు. ఎప్పటికప్పుడూ వీటిన్నింటినీ తీసుకెళ్లి ఓ పెద్ద డ్రమ్‌లో వేస్తారు. బండిల్ కార్యక్రమం మొత్తం పూర్తయ్యాక అసలు లెక్కింపు మొదలుకానుంది. అయితే ఇలా బండిల్ కట్టేందుకే కనీసం ఐదు నుంచి ఆరు గంటల సమయం పట్టొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఇది కొనసాగుతుండవచ్చని అంచనా. తొలి ప్రాధాన్యత ఓట్లను ముందుగా లెక్కిస్తారు. లెక్కింపునకు రెండు రోజుల సమయం పట్టవచ్చని భావిస్తున్న అధికారులు షిఫ్టులుగా సిబ్బందిని నియమించారు. 2021లో కౌంటింగ్‌కు 90 గంటల సమయం పట్టడంతో ఈసారి అదనపు టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో ప్రస్తుతం 36 గంటలలోపే కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కావచ్చని అంచనా వేస్తున్నారు.

ఎలిమినేషన్‌కు మరింత సమయం

తొలి ప్రాధాన్యత ఓట్లు పూర్తయ్యే సరికి అభ్యర్థుల వారీగా పోలైన ఓట్లపై అదేవిధంగా గెలుపు కోటాపై స్పష్టత వస్తుంది. అప్పటికీ ఏ అభ్యర్థి గెలుపు కోటా ఓట్లు సాధించలేకపోతే ఎలిమినేషన్ ప్రక్రియను మొదలుపెడతారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ రౌండ్‌ను ప్రారంభిస్తారు. ఆయనకు బ్యాలెట్‌లో పడిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను ఆయా అభ్యర్థుల వారీగా పంచుతూ వస్తారు. ఇలా ఒక్కో అభ్యర్థిని కిందినుంచి పైకి ఎలిమినేట్ చేస్తూ కౌంటింగ్ కొనసాగిస్తారు. ఈ క్రమంలో ఏ అభ్యర్థికైనా గెలుపు కోటా ఓట్లు వస్తే అక్కడితో కౌంటింగ్‌ను నిలిపివేసి విజేతను ప్రకటిస్తారు. అయితే మొత్తం 52 మంది బరిలో ఉండడంతో ఎలిమినేషన్ ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగే అవకాశం ఉంది. కిందటిసారి ఎలిమినేషన్ రౌండ్‌కే 44గంటల సమయం పట్టింది. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోనూ విజేత తేలకపోతే తృతీయ ప్రాధాన్యత ఓట్లను కూడా లెక్కించనున్నారు. కానీ ఇంతవరకు తృతీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరిగిన దాఖలాలు లేవనే చెప్పవచ్చు.